సాక్షి పల్నాడు

ఆదివారం । 10 । మార్చి । 2024

I




మహాకాళేశ్వరుడికి అభిషేకం

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం వేమవరంలో కోటిఒక్కలింగాల క్షేత్రంలో శనివారం తెల్లవారుజామున మహాకాళేశ్వరుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు.



వైభవంగా కల్యాణం

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

జైత్ర యాత్రకు సిద్ధం

- వైఎస్సార్ సీపీ నాల్గవ సిద్ధం సభకు భారీగా తరలి వెళ్లనున్న పార్టీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు
- ఇప్పటికే సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి లక్షలాదిగా వెళ్లే అవకాశం
- పార్టీ ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు సొంత వాహనాలు సిద్ధం చేసుకున్న అభిమానులు
- ఇప్పటికే జోష్ మీద ఉన్న క్యాడర్‌లో సీఎం జగన్ సందేశంతో మరింత పెరగనున్న ఉత్సాహం

నేడు దారులన్నీ బాపట్ల జిల్లా పి.గుడిపాడు వైపే..



బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల సమీపంలో సిద్ధం సభా వేదిక

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, నరసరావుపేట: సిద్ధం... ఈ మాట వింటేనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో ఎన్నికల యుద్ధానికి కదం తొక్కుతున్నారు.. మరోవైపు ఈ సభలకు వస్తున్న ప్రతిస్పందన చూసి ప్రతిపక్ష నేతలు మాత్రం ఓటమి భయంతో వణికిపోతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరిట ఇప్పటికే మూడు సభలు నిర్వహించి గడచిన నాలుగేళ్ల పది నెలల కాలంలో ప్రజలకు చేసిన మేలును వివరించడంతో పాటు ప్రజలకోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న మూకుమ్మడి కుట్రను వివరిస్తున్నారు. అందులో భాగంగా నేడు చివరి సిద్ధం సభ బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడులో జరగనుంది. ఇందులో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు హాజరుకానున్నారు. చరిత్రలో నిలిచేపోయే ఈ సభలో పాల్గొనాలని పల్నాడు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. జన నేత సందేశం వినాలని ఆత్రుతతో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని ప్రతి ఇంటికీ చేర్చి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడేలా చూడటమే లక్ష్యంగా నేడు వీరు సిద్ధం సభకు వెళ్లనున్నారు.

- గుంటూరు జిల్లాలో గుంటూరు పశ్చిమ నుంచి మంత్రి విడదల రజని, తూర్పు నుంచి నూరి ఫాతిమా, తాడికొండ నుంచి మేకతోటి సుచరిత, ప్రత్తిపాడు నుంచి బలసాని కిరణ్‌కుమార్, తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్, మంగళగిరి నుంచి ఎమ్మెల్యే ఆర్కే, సమన్వయకర్త మురుగుడు లావణ్య, పొన్నూరు నుంచి అంబటి మురళీకృష్ణ, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య నేతృత్వంలో జన సమీకరణకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ఇప్పటికే వాహనాలు సిద్ధం చేశారు.
- పల్నాడు జిల్లాలో సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు, మాచర్ల నుంచి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల నుంచి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట నుంచి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు నుంచి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వినుకొండ నుంచి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, చిలకలూరిపేట నుంచి సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో శ్రేణులు పెద్ద ఎత్తున సభకు తరలి వెళ్లడానికి సన్నద్ధం అవుతున్నారు.
- బాపట్ల జిల్లాలో బాపట్ల నుంచి ఎమ్మెల్యే కోన రఘుపతి, అద్దంకి నుంచి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, రేపల్లె నుంచి సమన్వయకర్త ఈవూరి గణేష్, ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, చీరాల నుంచి ఎమ్మెల్యే కరణం బలరాం, సమన్వయకర్త వెంకటేష్ పర్చూరు నుంచి సమన్వయకర్త ఎడం బాలాజీ, వేమూరు నుంచి సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో శ్రేణులు కదం తొక్కనున్నాయి.

సొంత వాహనాల్లో ప్రయాణం

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఇప్పటికే పలు మార్లు సిద్ధం సభ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో ప్రజలు సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ అభిమానుల కోరిక మేరకు సభకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో వాహనాలు ఏర్పాటు చేశారు. మరికొంత మంది కార్యకర్తలు తాము సొంతగా వాహనాలు ఏర్పాటు చేసుకొని సభకు వెళ్లనున్నారు. వీటితో నేడు దారులన్నీ సిద్ధం సభ వైపునకు మళ్లాయి. ఇప్పటికే మంచి జోష్ మీద ఉన్న వైఎస్సార్ సీపీ క్యాడర్ నేడు సిద్ధం సభ వేదికగా సీఎం వైఎస్ జగన్ ఇచ్చే సందేశంతో మరింత పెరిగిన ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో పని చేసి, పార్టీ అఖండ విజయానికి కృషి చేయనున్నారు.

సభను విజయవంతం చేయండి



బాపట్ల జిల్లా అద్దంకి నియోజక వర్గంలోని మేదరమెట్ల సమీపంలో నేడు జరగనున్న సిద్ధం సభలో లక్షలాది మంది పాల్గొని సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను, కార్యకర్తలను చైతన్య పర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలు ఒకదానిని మించి మరొకటి విజయవంతమవుతున్నాయన్నారు. చివరిగా మేదరమెట్ల సమీపంలో జరిగే సిద్ధం సభకు పల్నాడు జిల్లా నుంచి లక్షమంది తరలి రానున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సందేశం వినేందుకు మహిళలు, యువకులు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా సభకు బయలుదేరనున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సిద్ధం సభలో పాల్గొని ఆయన పిలుపునందుకొని రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘనవిజయానికి కృషి చేయాలన్నారు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు



ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

నరసరావుపేట: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలో ఆదివారం నిర్వహించే సిద్ధం సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు సభకు విచ్చేసే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

- చిలకలూరిపేట పట్టణం నుంచి వెళ్లే కార్లు, బైకులు, ఆటోలు పసుమర్రు గ్రామం మీదుగా పర్చూరు, చీరాల, త్రోవగుంట మీదగా ఒంగోలు వైపు వెళ్లాలని సూచించారు.
- ఒంగోలు వెళ్లే లారీలు, భారీ వాహనాలు నరసరావుపేట ఎస్ఆర్‌కేటీ సెంటర్, సంతమాగులూరు అడ్డరోడ్డు జంక్షన్, వినుకొండ, దర్శి మీదుగా ఒంగోలు వైపు వెళ్లాలి.
- గుంటూరు నుంచి నరసరావుపేట మీదుగా ఒంగోలు వెళ్లే వాహనాలు చుట్టుగుంట, పేరేచర్ల, ఫిరంగిపురం, నరసరావుపేట, సంతమాగులూరు అడ్డరోడ్డు జంక్షన్, వినుకొండ, దర్శి మీదుగా ఒంగోలుకు చేరాలన్నారు.
- 16వ నంబర్ జాతీయ రహదారిపై చిలకలూరిపేట నుంచి బొల్లాపల్లి టోల్ ప్లాజా వైపుకు ఎటువంటి వాహనాలను అనుమతించబడవని, సిద్ధం సభ ప్రాంగణానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ ఆంక్షలు మార్చి 10న ఆదివారం ఉదయం 6 గంటల నుంచి అమలులోకి వస్తాయన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా త్రికోటేశ్వరుని లింగోద్భవ పూజలు



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారికి లింగోద్భవ పూజలు వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి 12గంటల నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. విశేష ద్రవ్యాలు, పంచామృతాలు, విశేష ఫలాలతో నిర్వహించిన అభిషేకాల్లో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి లింగోద్భవ పూజలను తిలకించారు. తెల్లవారుజామున 3గంటల వరకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పలువురు అధికారులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు గురుకులాల్లో ప్రవేశ పరీక్షలు

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శైలజ శనివారం తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. రామకృష్ణాపురం బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఐదో తరగతికి 190 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి 228 మంది పరీక్ష రాయనున్నారన్నారు. అలాగే రామకృష్ణాపురంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి 212 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి 101 మంది పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు.

కీలు గుర్రంపై గ్రామోత్సవం



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతిలో శనివారం రాత్రి బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని కీలుగుర్రంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈసేవలో అమరేశ్వరాలయం నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు ఉత్సవాన్ని నిర్వహించారు. బాల చాముండేశ్వరీ దేవితో అమరేశ్వరుడు కీలుగుర్రంపై భక్తులు ఆనందంగా తిలకించారు.

18 నుంచి ఉచిత శిక్షణ

గుంటూరురూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కె.వి.కె)లో నిరుద్యోగ యువతీ యువకుల కోసం పండ్లు, కూరగాయలతో విలువ ఆధారిత పదార్థాల తయారీ తదితర విషయాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కె.వి.కె. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కార్యక్రమం వారం రోజులపాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.



సిద్ధం సభాస్థలిని పరిశీలిస్తున్న పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల, రేంజ్ ఐజీ పాలరాజు, ఎస్పీ జిందాల్



వేదిక వద్ద ఎమ్మెల్యే కరణం బలరాం, తలశిల, యెనుముల, మాదిరెడ్డి తదితరులు



సభా ప్రాంగణం

సిద్ధం సభకు కదలిరండి

- బుల్లెట్‌తో పల్లెల్ని చుట్టివచ్చిన మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో మమేకం



బుల్లెట్‌పై గ్రామాల్లో పర్యటిస్తున్న మంత్రి అంబటి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): సిద్ధం సభ సమాయత్తంలో భాగంగా మండలంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు బుల్లెట్‌పై విస్తృత పర్యటన చేపట్టారు. శనివారం మండలంలోని ఇరుకుపాలెం, మాదల, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం గ్రామాలలో ర్యాలీగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ద్విచక్రవాహనాలతో పర్యటించారు. మార్గమధ్యలో ప్రజానీకాన్ని పలకరిస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. అడుగడుగునా ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు.

సభకు భారీగా తరలిరావాలి....

ఈ నెల 10వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మేదరమెట్ల వద్ద జరిగే సిద్ధం సభకు భారీగా తరలి రావాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి సభకు హాజరయ్యేలా చూడాలని, ఆమేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామంలోని పార్టీ ముఖ్య నాయకులు సమాయత్తం కావాలన్నారు. ఎంత మంది కలసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. అందుకు గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి వద్దకు వెళ్లి వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకొని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, సచివాలయ జేసీఎస్ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, మాదల గ్రామ ఉప సర్పంచ్ సైదా, కానాల పుల్లారెడ్డి, ఇంటూరి వీరయ్య, రుద్రవరం సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, గున్నం కృష్ణారెడ్డి, కాటయ్య, సైదా, జానీబాషా, గంజి శ్రీనివాసరావు, కళ్లం కోటిరెడ్డి, బద్దిగం వెంకటరెడ్డి, కారుమూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చూచిన కనులదే భాగ్యము

వైభవంగా అమరేశ్వరుని కల్యాణం

అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరారామ క్షేత్రంలో వేం చేసియున్న బాలచా ముండికా సమేత అమరేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలలో భాగంగా మాఘశుద్ధ చతుర్థశి నాడు కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత శుక్రవారం రాత్రి స్వామివారికి లింగోద్భవ కాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి రెండుగంటకు స్వామి వారికి, అమ్మవారికి ఎదుర్కోల మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవంలో విఘ్నేశ్వరపూజ, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాలు క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవానికి ప్రముఖ ఆధ్యాత్మిక వ్యాసరచయిత పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించి స్వామి వారి కల్యాణోత్సవాన్ని సామాన్యభక్తులకు స్వామివారి కల్యాణోత్సవ విశిష్టతను వివరించారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, పాలక మండలి చైర్మన్ రాజా వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను సమర్పించారు. ఉపవాసంతోపాటుగా జాగరణ చేసే భక్తుల కోసం దేవాలయాధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ భక్త బృందాలు నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాగరణ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎ.వి బ్రహ్మం బందోబస్తు నిర్వహించారు.



తలంబ్రాలు పోస్తున్న దృశ్యం

ఉత్సవమూర్తుల ఊరేగింపు

బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం నంది, చిలుక, చిన్న రథంపై కల్యాణమూర్తులను వైభవోపేతంగా ఊరేగించారు. తొలుత కల్యాణ వేదికపై నుంచి కల్యాణమూర్తులను అమ్మవార్లను, స్వామి వారిని వాహనాలపై అలంకరించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అమరావతి ప్రధాన పురవీధులలోబాజా భజంత్రీలతో ఎంతో వైభవంగా నిర్వహించిన ఈ ఉత్సవంలో భక్తులు స్వామివారికి ఎదురేగి వార్లు పోసి హారతులిచ్చి పూజలు నిర్వహించారు. ఉత్సవంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అమరేశ్వరుని దివ్య రథోత్సవం

అమరావతి అమరేశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరునికి దివ్య రథోత్సవం నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపీనాథశర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

తిరునాళ్లలో అపశ్రుతి

- నేలకొరిగిన యడవల్లి విద్యుత్ ప్రభ
- ఇద్దరికి గాయాలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో అపశ్రుతి చోటుచేసుకుంది. తిరునాళ్ల అనంతరం తిరుగు ప్రయాణంలో యడవల్లి ప్రభ నేలకొరిగింది. యూటీ జంక్షన్ వద్ద హైటెన్షన్ వైర్లను దాటే క్రమంలో ప్రభ ప్రమాదానికి గురైంది. ప్రభను వెనుకకు వంచే క్రమంలో బ్యాలెన్స్ తప్పి ముందుకు పడింది. దీంతో ప్రభను తరలించేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కందుల వీరాంజనేయులుతో పాటు మరొక వ్యక్తి గాయపడ్డాడు. వీరిని చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు ట్రాక్టర్లు స్వలంగా దెబ్బతిన్నాయి. ప్రభలు తిరుగు ప్రయాణంలో ఉదయం 9గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో వెనుక వస్తున్న ఆరు ప్రభలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం 2గంటల సమయంలో భారీ క్రేన్ల సహాయంతో నేలకొరిగిన యడవల్లి ప్రభను తొలగించి నిలిచిపోయిన ప్రభలకు దారిఇచ్చారు.

జిన్నింగ్ మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- 2500 క్వింటాళ్ల ముడి పత్తి, ట్రాక్టర్ బ్లోజర్ దగ్ధం
- రూ.2 కోట్ల వరకు నష్టం అంచనా



మంటల్ని ఆర్పేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యడ్లపాడు: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని లక్ష్మీగణపతి ప్రైవేట్ లిమిటెడ్ జిన్నింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పారిశ్రామికవాడలో గత పదేళ్లుగా గుంటూరుకు చెందిన కేవీ నారాయణ మిల్లును నడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం సుమారు 1.40 గంటల సమయంలో మిల్లు ప్రాంగణంలోని ముడి పత్తిని రా మెటీరియల్ గోదాములోకి ట్రాక్టర్ బ్లోజర్‌తో తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బయట వరండాలోనూ, దాని పక్కనే ఉన్న గోదాములోని ముడిపత్తి దగ్ధమైంది. కార్మికులు గుర్తించి అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. ప్రమాదం సంభవించిన సమయంలో గాలి ఎక్కువగా వీయడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. చిలకలూరిపేట, నరసరావుపేట అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంటకు పైగా శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చాయి. వీరితో పాటు సమీపంలోని మిల్లులకు చెందిన యాజమాన్యాలు తమ ట్యాంకర్లను మంటల్ని ఆర్పేందుకు పంపించారు. ప్రమాదానికి కారణం ట్రాక్టర్ బ్లోజర్ సైలెన్స్ నుంచి సన్నని అగ్గిరవ్వలు వచ్చి ఉండొచ్చని అటు ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్, మిల్లు యాజమాన్యం భావిస్తున్నారు. ఈ సందర్భంగా మిల్లు ఎండీ నారాయణ మాట్లాడుతూ జిన్నింగ్ యూనిట్‌కు తరలించే ముందుగా రా మెటీరియల్‌ను గోదాములో నిల్వ ఉంచుతామన్నారు. ప్రమాదంలో సుమారు 2500 క్వింటాళ్ల పూర్తిగా కాలిపోయిందన్నారు. ప్రస్తుత మార్కెట్ ముడి పత్తి ధర క్వింటా రూ.7,600 ఉందని, ఆ ప్రకారంగా రూ.1.90 కోట్ల వరకు నష్టం వాటిల్లి ఉంటుందన్నారు. వీటితో పాటు పత్తిని తరలిస్తున్న ట్రాక్టర్ బ్లోజర్ కూడా దగ్ధమైనట్లు చెప్పారు. అయితే ప్రమాదం జరగడానికి కారణం, అలాగే మిల్లులో నిల్వ మొత్తం ఎక్కడెక్కడ నుంచి ఎంత మొత్తంలో తీసుకువచ్చారు. వాటిలో దగ్ధమైనది ఎంత తదితర వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

కాలువలో పడి ఇద్దరు మృతి

- బైక్ అదుపు తప్పి ఘటన
- విషాదంలో తక్కెళ్లపాడు



షేక్ నాగూర్ వలి




అనిల్‌కుమార్

పెదకాకాని: బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన తక్కెళ్లపాడు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ షేక్ నాగూర్ వలి, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొచ్చర్ల అనిల్‌కుమార్ స్నేహితులు. ఇద్దరూ శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు వెళ్లారు. రాత్రి తిరిగి తక్కెళ్లపాడు బయలు దేరారు. వారు ప్రయాణిస్తున్న గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి ఎన్‌టీఆర్ మానస సరోవరం పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. శనివారం ఉదయం అటువైపుగా వెళుతున్న వారు కాలువలో తేలి ఉన్న షేక్ నాగూర్‌వలి మృత దేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ ప్రాంతానికి చేరుకుని వెతకగా కొచ్చర్ల అనిల్‌కుమార్ మృతదేహం కూడా లభ్యమైంది. ఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని షేక్ నాగూర్‌వలి(30), కొచ్చర్ల అనిల్‌కుమార్(30) మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు మార్చురీకి తరలించారు. షేక్ నాగూర్ వలికి భార్య, కుమార్తె ఉండగా అనిల్‌కుమార్‌కు ఇంకా వివాహం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

కారు బీభత్సం.. ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదం సృష్టించిన కారు



సునీత మృతదేహం

గుంటూరురూరల్: కారు బీభత్సం సృష్టించి రోడ్డు పక్కన నివసించే కూలీలపై దూసుకెళ్లింది. ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన మల్లిపోగు సునీత(38), సందెపోగు లత తమ కుటుంబ సభ్యులతో కలసి కూలి పనులు చేసుకుంటూ అడవితక్కెళ్లపాడు వద్ద రోడ్డుపక్కన చిన్నపాటి డేరాను వేసుకుని జీవిస్తున్నారు. రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. ఆరు బయట సునీత, లతలు బట్టలు ఉతుక్కుంటూ కూర్చున్నారు. ఇంతలో అతి వేగంతో వస్తున్న కారు వీరిపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో సునీత తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, లతకు తీవ్రగాయాలై రెండుకాళ్లు కోల్పోయినట్లు తెలిసింది. మితిమీరిన వేగంతో కారు నడుపుతున్న వ్యక్తి, కారులో ఉన్న ముగ్గురు యువకులు మైనర్లుగా తెలిసింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

చత్తిపాడు: మిల్లుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసి, తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని భారీ మొత్తంలో పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. వట్టిచెరుకూరు మండలంలోని రైస్ మిల్లుల్లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి అక్రమ వ్యాపారం చేస్తున్నారంటూ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి, డెప్యూటీ తహసీల్దార్లు ఎం.పద్మజ, ఎ.శివశంకర్, పి.దుర్గారావు, ఐ.అనిల్‌కుమార్ మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. చమళ్లమూడిలోని పద్మజ రైస్ మిల్లుకు చెందిన లారీలో ఎలాంటి బిల్లులు లేకుండా 300 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రవాణా చేస్తుండటంతో లారీని నిలిపి తనిఖీలు చేశారు. అందులో ఉన్న బియ్యం ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అనంతవరప్పాడులోని శ్రీవల్లి రైస్ మిల్లుకు చెందిన లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

సిద్ధం సభకు పల్నాడు నుంచి తరలి రండి

ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభకు లక్షలాది తరలిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదివారం బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్లలో సమీపంలో సిద్ధం సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. లక్షలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను, కార్యకర్తలను చైతన్యవంతం చేసేందుకు సిద్ధం సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు పల్నాడు జిల్లా నుంచి దాదాపు 50 వేల మందికి పైగా వెళ్లనున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సందేశం వినేందుకు మహిళలు, యువకులు, రైతులు, ప్రజలు ఉత్కంఠతతో స్వచ్ఛందంగా సిద్ధం సభకు బయలుదేరుతున్నారని వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

భారీ వాహనాలతో సభకు...

మాచర్ల నియోజకవర్గం నుంచి దాదాపు వెయ్యి వాహనాలతో పాటు, టూ వీలర్స్, పలు రకాల వాహనాలలో ఆదివారం ఉదయం తరలివెళ్లనున్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌ల ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలుకుతూ ఆయా వార్డులు, మండలాల వారీగా వందలాది వాహనాలతో వేలాది మంది తరలి రావటానికి ఇప్పటికే సర్వం సిద్ధమయ్యారు.

డివైడర్‌ను ఢీకొని వాహనం బోల్తా..

- ఆరుగురికి గాయాలు, ఒకరు అపస్మారక స్థితి
- యడ్లపాడు వద్ద హైవేపై ఘటన
- బాధితులంతా భద్రచలం వాసులే



యడ్లపాడు వద్ద హైవేపై పల్టీ కొట్టిన వాహనం



క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



అపస్మారక స్థితిలో బుజ్జి

యడ్లపాడు: తిరునాళ్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉన్న వాహనం డివైడర్‌ను ఢీకొంది. యడ్లపాడు వద్ద శనివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వివరాలు... భద్రాచలానికి చెందిన వారు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు బొలెరో వాహనంలో దర్శనానికి వచ్చారు. శుక్రవారం స్వామిని దర్శించుకుని రాత్రి కొండ వద్దే జాగారం చేసి శనివారం మధ్యాహ్నం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. యడ్లపాడు వంతెన వద్దకు రాగానే హైవే డివైడర్‌ను ఢీకొని వాహనం పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న బుజ్జి అనే మహిళ వాహనం నుండి రోడ్డుపై వచ్చి పడటంతో అపస్మారక స్థితికి వెళ్లింది. తోటి ప్రయాణికులైన తులసి, లక్ష్మి, చిన్నమ్మాయిలతో పాటు డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది బాధితుల్ని చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారంతా క్యాటరింగ్ నిర్వాహకులని, డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం రైతులకు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు కోరారు. పల్నాడు విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. రైతులు, కార్మికులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. 40 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ ఢిల్లీ రాంలీల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరింది.రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి, షేక్ సిలార్, పుల్లారెడ్డి, కట్టా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 680 మంది గైర్హాజరు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన జూనియర్ ఇంటర్మీడియెట్ పరీక్షకు పల్నాడు జిల్లాలో 680 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పరిధిలో 14,935 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 14,251 మంది హాజరైనట్లు పరీక్షల ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తెలిపారు. జనరల్ విద్యార్థులు 13,998 మందికి గాను 13,446 మంది హాజరు కాగా, మరో 549 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. అలాగే 937 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 805 మంది హాజరు కాగా, మరో 131 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

త్రికోటేశ్వరుని ఆదాయం రూ.1.63 కోట్లు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఆదాయం రూ.1,63,48,227 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి తెలిపారు. పూజ టికెట్ల అమ్మకం ద్వారా రూ.54,99,638, ప్రసాదాల ద్వారా రూ.35,92,950, అన్నదానం, ఇతర సేవల ద్వారా రూ.2,01,776, హుండీలు ద్వారా రూ.70,53,863 లభించిందన్నారు. స్వామి వారికి వెండి 506 గ్రాములు, బంగారం 49 గ్రాములు లభించిందని తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధికారి చంద్రకుమార్, ఉప కమిషనర్ వారి కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, దేవదాయశాఖ నరసరావుపేట పరిశీలకుడు మంజూష పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆదాయం రూ.65.24 లక్షలు

నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా రూ.65.24 లక్షలు ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుల ద్వారా ప్రయాణించిన 2.36లక్షల ప్రయాణికులు ప్రయణించినట్లు చెప్పారు. గతేడాది కంటే సుమారుగా రూ.12 లక్షల ఆదాయం తగ్గిందని వివరించారు.